క్లుప్తంగా

ముగిసిన వార్షికోత్సవం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని సాయినగర్ సకల దేవతల ఆలయం 9వ వార్షికోత్సవం శనివారం ముగిసింది. కార్యక్రమంలో భాగంగా సకలదేవతామూర్తులకు పంచామృతాభిషేకం, సభామంతపారాధనలు నిర్వహించారు. పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య శివపార్వతుల కల్యాణం జరిపించారు. ఆలయ ప్రాంగణంలో సుదర్శనహోమం, మహామృత్యుంజయ హోమం, జాయదిహోమాలు చేసి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం మహామంగళహారతి నివేదించి మహాఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ చేశారు. వేడుకల్లో కాలనీవాసులతోపాటు భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలలో వలంటీర్ల బోధన

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శనివారం బాదేపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్నేహపూర్వకంగా పాఠాలు బోధించారు. విద్యార్థులు పాఠాలు బోధించటం వల్ల వారిలో సృజనాత్మకత వెలుగుచూస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ, ఎన్‌ఎస్‌ఎస్ 4 ప్రోగ్రాం ఆఫీసర్ రమాదేవి పేర్కొన్నారు. బోధనకు అనుమతి ఇచ్చిన హెచ్‌ఎం మాధవికి ధన్యవాదాలు తెలిపారు.

ముగిసిన అబ్దుల్ రహిమాన్ ఉర్సు



చిన్నచింతకుంట: అప్పంపల్లిలో మూడు రోజుల పాటు కొనసాగిన అబ్దుల్ రహిమాన్(మాసన్న) ఉర్సు శనివారంతో ముగిసింది. వేడుకలకు వివిధ ప్రాంతాల పీఠాధిపతులు తరలివచ్చారు. వారిలో సాబేర్ పాషా, అజీజ్ పాషా, దుప్పల్లి దర్గా పీఠాధిపతులు కరుణాకర్‌గౌడ్, రవికుమార్‌గౌడ్, దర్గా నిర్వాహకులు శంకర్, సుదర్శన్, కమలాకర్, భగవాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

నవాబుపేట: మండలంలో అక్రమంగా ఇసుక రవాణ చేస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. శనివారం హజిలాపూర్ సమీపంలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశారు. కృత్రిమ ఇసుక తయారుచేసినా చర్యలు తప్పవని హెచ్చరికలు జారీచేశారు.



చిన్నచింతకుంట: గోప్యానాయక్ తండాకు చెందిన పాత్లావత్ శంకర్‌నాయక్ మన్నెపు వాగు నుంచి, పల్లమర్రికి చెందిన తెలుగు జనార్దన్ అలియాస్ రాజు శనివారం ఊకచెట్టు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు వారు ఇసుకను తరలిస్తున్న ఇరువురి ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.
హన్వాడ: వేపూర్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని శనివారం తెల్లవారుజామున హన్వాడ పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ రాజును అదుపులోకి తీసుకుని లారీని హన్వాడ ఠాణాకు తరలించారు. ఈమేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ వివరించారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

భూత్పూర్: మండల కేంద్రంలో మునిరంగస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా తేరు, శకటోత్సవం (బండ్లు) నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బీఆర్‌ఎస్ నాయకుడు మురళీధర్ గౌడ్ ఏటా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ నేత మహ్మద్ సాధిక్ తదితరులు ఉన్నారు.

సరోజినినాయుడుకు ఘననివాళి

హన్వాడ: భారత కోకిల సరోజిని నాయుడు వర్ధంతిని శనివారం మండలకేంద్రంలోని ది ఎవరెస్ట్ టాలెంట్ స్కూల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలల వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ రాజేందర్‌జీ, మహేష్, బాల్‌రాజు, నవీన, షాహెదా, ప్రియాంక, అనిత, లావణ్య, చంద్రి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హన్వాడ: మండలకేంద్రంలో బీజేపీ నాయకుడు పోతట్ల శేఖర్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ప్రారంభమైంది. మండల నాయకుడు రఘురాంగౌడ్, కుర్మగడ్డ అశోక్, శ్రీను, చందు, రాజు, వెంకటేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామాలు నిరుపయోగం



కప్లాపూర్ వైకుంఠధామం

- దహనానికి అవరోధంగా పల్లెల సంప్రదాయాలు
- సౌకర్యాల లేమితోనూ అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు అనాసక్తి

గండేడ్: మండల పరిధిలోని అనేక గ్రామాల్లో వైకుంఠధామాలు నిరుపయోగంగా మారుతున్నాయి. చాలా గ్రామాల్లో చనిపోయినవారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రూ. లక్షలు ఖర్చు చేసి వీటని నిర్మింపచేసింది. అప్పట్లో మృతదేహాలకు దహన సంస్కారలు నిర్వహించేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశారు. ఉమ్మడి మండలంలో 49 గ్రామపంచాయతీల్లోనూ వైకుంఠధామాల ఏర్పాటు జరిగింది. అయితే స్థానికులు అంతిమసంస్కారాల సమయంలో వీటిని వినియోగించేందుకు ఆసక్తి చూపడం లేదు.

కారణాలివే...

ఆయా గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలను ఎక్కువశాతం అనుకూలంగా లేనిచోట నిర్మించారు. జానంపల్లి, మన్సూర్‌పల్లి తండా, అంచన్‌పల్లి, పెద్ద వార్వాల్, కప్లాపూర్, గాధిర్యాల్, చౌదర్‌పల్లి, మొకర్లాబాద్ తదితర గ్రామాల్లో చాలా దూరంగా వీటిని ఏర్పాటు చేశారు.

➡ ఆయా చోట్ల వైకుంఠధామాలకు వెళ్లే దారి సరిగా ఏర్పాటు చేయలేదు. కనీసం పిల్ల బాటలు కూడ లేని పరిస్థితి నెలకొంది.

➡ ఉమ్మడి మండలంలో కొన్ని చోట్ల సరైన నీటివసతి వంటివి కల్పించలేదు.

➡ దీంతో కార్యక్రమాల నిర్వహణకు అవరోధంగా మారింది.

➡ వీటికితోడు గ్రామాల్లో ఎక్కువ శాతం మంది దహన సంస్కారం నిర్వహించడానికి ఇష్టపడడం లేదు. ఈ నేపథ్యంలో రూ. కోట్లు వృథా అయ్యాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పిస్తాం



అంతిమ సంస్కారాల నిర్వహణలో ప్రజలు ఇబ్బందులు పడొద్దని వైకుంఠధామాలను ఏర్పాటు చేశారు. అయితే గ్రామాల్లో ఎక్కువ శాతం దహనం చేసే సంప్రదాయం లేదు. పూడ్చిపెట్టడానికే ప్రాధాన్యతనిస్తున్నారు. సంప్రదాయాన్ని కాదనే పరిస్థితి లేదు. రోడ్డులేని వాటికి కచ్చితంగా సౌకర్యం కల్పిస్తాం. నీటి సమస్యలాంటి సమస్యలు ఏమైనా ఉంటే వాటిని పరిష్కరిస్తాం. అయినప్పటికీ ప్రజల్లో మార్పు వస్తేనే వీటిని వినియోగం సాధ్యమవుతుంది.

– దేవన్న, ఎంపీడీఓ, ఉమ్మడి గండేడ్ మండలం

పోలియో చుక్కలు చిన్నారులకు వరం

నవాబుపేట: పోలియోచుక్కలు చిన్నారుల పాలిట వరంలాంటివని మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్ చంద్ర, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ శకుంతల, శ్రీనివాస్, రాఘవేందర్, శరభలింగం, అవినాష్, ఐసీడీఎస్ సిబ్బంది సరస్వతీ, ప్రమీల, ఉమాదేవి, విమల, సునిత, అనుసూయ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

గండేడ్: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గండేడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలో 35 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు శనివారం తెలిపారు.
భూత్పూర్: పల్స్‌పోలియో విజయవంతం చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి డా. శ్రీధర్ అన్నారు. శనివారం భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకుముందు వైద్యాధికారి అబ్దుల్ రబ్, ఆశ వర్కర్లు, విద్యార్థులతో పల్స్‌పోలియోపై ర్యాలీ నిర్వహించారు.
కోయిల్‌కొండ: పిల్లలందరికీ పోలీయో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని డాక్టర్ నరేష్ అన్నారు. ఆదివారం మండలంలో 56 కేంద్రాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు.

‘ఎంవీఎస్’లో ఓటు నమోదుపై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో డోర్ టూ డోర్ ప్రచారం చేపట్టి ప్రజలకు ఓటు పై అవగాహన పెంచాలన్నారు. అధ్యాపకులు రాఘవేందర్, స్వరూప, నిరంజన్‌గౌడ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి తరలిన భక్తులు



నవాబుపేట: శివమాల ధరించిన భక్తులు శనివారం శ్రీశైలం తరలివెళ్లారు. మండల పరిధిలోని పోమాల్, చెన్నారెడ్డిపల్లి గ్రామాల్లో మల్లేష్ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి ధరించిన అనంతరం కార్యక్రమం ప్రారంభించారు. వివిధ గ్రామాల స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

రాచాలలో మహా పడిపూజ

అడ్డాకుల: మండలంలోని రాచాల గ్రామంలో శివభక్తులు శనివారం మహాపడి పూజ నిర్వహించారు. స్థానిక శివాలయంలో పూజలు చేసి పాదయాత్రగా శ్రీశైల క్షేత్రానికి బయలు దేరారు. పడిపూజకు బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ హాజరయ్యారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పిల్లి సూర్యనారాయణ, రమేష్, మయూరనాథ్, హరికృష్ణ, చెన్నకేశవులు, భీముడు, సురేష్, బాలరాజు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులైన విద్యార్థులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కరస్పాండెంట్ నామాల రవిప్రకాష్, ఉపాధ్యాయులు రమాదేవి, తిరుపతయ్య, వడ్ల అనురాధ, గాయత్రి, నందిని, కావ్య, మహాలక్ష్మి తదితరులు ఉన్నారు.
హన్వాడ: మునిమోక్షం యూపీఎస్‌లో, గొండ్యాల్‌గేట్ ప్రాథమిక పాఠశాలలోనూ శనివారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం కిష్యునాయక్, ఎంఈఓ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.



మునిమోక్షంలో స్వయంపాలన దినోత్సవం

ఆలస్యంగా రావడంతో అనుమతి నిరాకరణ

పరీక్ష రాయలేక వెనుదిరిగిన విద్యార్థిని

గండేడ్/మహమ్మదాబాద్: ఆలస్యంగా పరీక్షకేంద్రానికి వచ్చిన నేపథ్యంలో సిబ్బంది అనుమతి నిరాకరించగా ఓ విద్యార్థి ఇంటర్ పరీక్ష రాయలేకపోయిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. చెన్నాయిపల్లికి చెందిన నందిని మండల కేంద్రంలోని విశ్వభారతి జూనియర్ కళాశాలలో బైపీసీ రెండో సంవత్సరం చదువుతోంది. ఆమె నంచర్ల గురుకుల పాఠశాలలో పరీక్షలు రాస్తోంది. శనివారం ఉదయం పరీక్ష రాసేందుకు చెన్నాయిపల్లి నుంచి కాలినడకన బయలు దేరింది. దాదాపు రెండు కిలోమీటర్లు నడిచి గండేడ్‌కు చేరుకునే సరికి పరీక్ష సమయం దగ్గరపడింది. ఈ క్రమంలో వేరే వాళ్ల బైక్ ఎక్కించుకొని నంచర్ల కేంద్రానికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే గ్రేస్‌టైం దాటిపోయి.. అదనపు సమయం కావడంతో అక్కడ డ్యూటీలో ఉన్న సిబ్బంది లోపలికి అనుమతించలేదు. ఎంత వేడుకున్నా ఫలితం లేకపోవడంతో చేసేదిలేక ఆ విద్యార్థి వెనుదిరిగింది.

నేడు స్కూల్ స్వీపర్ల సమావేశం

భూత్పూర్: మహబూబ్‌నగర్‌లో స్కూల్ స్వీపర్ల సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. చిన్న రాయుడు, మండల అధ్యక్షుడు టి. వెంకటయ్య, ఉపాధ్యక్షుడు వట్టెం రామస్వామి ఓ ప్రకటనలో శనివారం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు ఇతర జిల్లాలు, మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు విధిగా హాజరు కావాలని కోరారు.

చక్కటి క్రమశిక్షణ అలవర్చుకోవాలి

మహమ్మదాబాద్: చదువే జీవితానికి చక్కటి మార్గనిర్దేశకం అని జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కం జనార్దన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఏటీఆర్ ఉన్నత పాఠశాలలో పదోవ తరగతి వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. చదువు లేకపోతే ఉన్నత స్థాయిలో రాణించడం కష్టమన్నారు. చక్కటి క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి పదో తరగతిలో పది పాయింట్లు సాధించే విద్యార్థులకు చెరో రూ. పదివేలు.. తిరుపతి వెళ్లడానికి ఫ్లైట్ టికెట్లు ఉచితంగా ఇస్తామన్నారు. ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభాకర్, టౌన్ ప్రెసిడెంట్ మాధవి, ట్రస్మా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న బెక్కం జనార్దన్

కొత్వాల్ నియామకంపై హర్షం

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఒబేదుల్లా కొత్వాల్‌ను రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆయన హయాంలో యువతకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



కోయిల్‌కొండ: మండలంలో ధరణిలో ఉన్న పెండింగ్ భూ సమస్యల దరఖాస్తులను కలెక్టర్ ఆదేశానుసారం సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని జమాల్‌పూర్, మల్కాపూర్ గ్రామాల్లో మూడు బృందాలుగా సమస్యలను పరిశీలించినట్లు వివరించారు.

సేవలు అభినందనీయం

చిన్నచింతకుంట: రోటరీ క్లబ్ వారి సేవాకార్యక్రమాలు అభినందనీయమని డీఈఓ రవీందర్ అన్నారు. శనివారం బండర్‌పల్లి ఉన్నత పాఠశాలలోని 15 మంది విద్యార్థినులకు క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ నిర్వహించగా పాల్గొని మాట్లాడారు. ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మలుపు వద్ద మరమ్మతు చేపట్టాలి



రాయపల్లికి వెళ్లే చోట మలుపువద్ద పరిస్థితి

రాజాపూర్: ముదిరెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారి నుంచి రాయపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న మలుపు వద్ద మరమ్మతులు చేపట్టి వాహనదారుల ఇబ్బందులు తొల్గించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ముఖ్యంగా జాతీయరహదారిని విస్తరించే సమయంలో నేషనల్ హైవే అధికారులు రాయపల్లి గ్రామాన్ని లిస్టులో చేర్చకపోవడంతో అక్కడ గ్రామం ఉందని ఎవరికీ తెలియడం లేదన్నారు. జాతీయ రహదారికి మరమ్మతు చేసే సమయంలో సమీపంలోని అన్ని గ్రామాలకు 20 మీటర్ల వరకు బీటీ రోడ్డు వేశారని.. రాయపల్లి దారిని మాత్రం పట్టించుకోలేదన్నారు. దీంతో మలుపు వద్ద ఏర్పడ్డ గుంతల వల్ల నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌లోకి గిరిజన నాయకులు

నవాబుపేట: మండల పరిధిలోని కొల్లూర్ ఉమ్మడి గ్రామపంచాయతీకి చెందిన పలు గిరిజన తండాల నాయకులు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. శనివారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుయాదవ్, ఎంపీటీసీ తులసీరాంనాయక్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పార్టీ చేరిన వారిలో బట్టానిపల్లి మాజీ సర్పంచ్ మాన్యానాయక్, వెంకటేశ్వర్‌తండా మాజీ ఉపసర్పంచ్ భగవాన్‌నాయక్, జానునాయక్, కిషన్‌నాయక్ తదితరులు ఉన్నారు. కొల్లూర్ కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య, నర్సింహచారీ, ఠాగూర్, గోపాల్‌నాయక్, అశోక్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

శ్రీపాదరావు సేవలు మరువలేనివి



నివాళులు అర్పిస్తున్న జెడ్పీ ఉద్యోగులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మాజీ స్పీకర్ శ్రీపాదరావు సేవలు మరువ లేనివని జెడ్పీ సీఈఓ రాఘవేందర్‌రావు అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ హాల్‌లో శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసినివాళి అర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు శ్రీహరి, విజయ్‌కుమార్, ఆనంద్‌కుమార్, ఇనాయత్, రాజు, శేఖర్, సత్యం, జహంగీర్, వెంకటేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.
గండేడ్: మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి మండల పరిధిలోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించారు. ఎంపీడీఓ దేవన్న, సూపరింటెండెంట్ ప్రతాప్‌రెడ్డి, ఏపీఓ హరిశ్చంద్రుడు, సీనియర్ అసిస్టెంట్ సత్యయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మాజీ స్పీకర్ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఎంఈ యు.బస్వరాజ్, మేనేజర్ వెంకటేశ్వరరావుతో పాటు మున్సిపల్ సిబ్బంది, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన అవసరం

జడ్చర్ల టౌన్: ఆన్‌లైన్ మోసాల పట్ల, రోడ్డు భద్రత, మానవ అక్రమ రవాణపై అప్రమత్తంగా ఉండాలని సీఐ ఆదిరెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం స్థానిక డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల సమావేశ మందిరంలో సైబర్‌క్రైమ్, రోడ్డు భద్రత, మానవ అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సురక్ష పోలీస్ కళాజాత ఆధ్వర్యంలో ఆట పాటల ద్వారా విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు సుభాషిణి, సదాశివయ్య, అధ్యాపకులు విఠల్, మంజుల, మాధవి, జగన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సీఐ ఆదిరెడ్డి

పశువులకు టీకాలు వేయించాలి

అడ్డాకుల: పశువులు, గేదెలకు తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని మూసాపేట మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ సూచించారు. మూసాపేట, కొమిరెడ్డిపల్లి గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు తెలిపారు. 40 ఆవులు, 260 గేదెలకు టీకాలను వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సుబ్బారెడ్డి, రాజేశ్వరి, చంద్రమోహన్‌గౌడ్, రవి, శివ, సావిత్రి ఉన్నారు.



టీకాలను వేస్తున్న పశువైద్యాధికారి మధుసూదన్

ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు

భూత్పూర్: మండలంలోని పాత మొల్గరకి చెందిన గుంజ రమేష్ ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. చిన్నతనంలోనే తల్లి మరణించగా.. తండ్రి వెంకటయ్య తమను కష్టపడి చదివించారని తెలిపారు. తన తండ్రి చిరకాల కోరిక నేరవేర్చినందుకు చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రమేష్ తండ్రి వెంకటయ్య చేస్తూ ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించారు. తన పిల్లలు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని.. అందుకోసం ప్రోత్సహించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన టీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు రమేశ్ ఎంపికయ్యారు.

డిగ్రీ లెక్చరర్‌గా .. మండల ప్రణాళికా గణాంక అధికారి

బాలానగర్: మండల ప్రణాళికా గణాంక అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌గౌడ్ డిగ్రీ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. డిప్యూటీ తహసీల్దార్ లిఖితా రెడ్డి, ఎన్ఫోర్స్‌మెంట్ డీటీ దీపిక, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్‌రావు, ఆర్‌ఐలు వెంకట్ రెడ్డి, రాజేశ్వరితో పాటు పలువురు ఆయనను సన్మానించి స్వీట్లు తినిపించారు. కాగా శాఖాపూర్‌లో ఓ సాధారణ రైతు కుటుంబానికి చెందిన శ్రీకాంత్‌గౌడ్ ఇంట్లో దాదాపు అందరూ ఉద్యోగులే కావడం గమనార్హం. అతడి అన్న లక్ష్మీనారాయణ స్కూల్ అసిస్టెంట్‌గా, చెల్లెలు అనిత ఎస్‌ఐగా, భార్య ప్రత్యూష పంచాయతీ కార్యదర్శిగా ఆయా చోట్ల విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా శ్రీకాంత్‌గౌడ్ తాజా ఫలితాల్లో రాష్ట్రస్థాయి 4వ ర్యాంకు సాధించడంపై ఆయన కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

కూమార్తెను చూడడానికి వచ్చి.. వ్యక్తి అదృశ్యం



హన్వాడ: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలం చిన్నతిరుమలాపురం గ్రామానికి చెందిన పట్నం యాదగిరి గత నెల 29న మండల కేంద్రంలోని తన కుమార్తె ఇంటివచ్చాడు. ఈ క్రమంలోనే ఆ ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో.. హన్వాడ ఠాణాలో అతడి కుమారుడు పట్నం శేఖర్ ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



స్టేషన్ మహబూబ్‌నగర్: కుల, మతాలకతీతంగా పేదల సమస్యలను పరిష్కరించడమే ఏఐఎంఐఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ అన్నారు. శనివారం ఆవిర్భావ దినోత్సవం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అబ్దుల్‌ఖాదర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్ అడ్వకేట్, పట్టణ అధ్యక్షుడు సాధతుల్లా హుస్సేని, నాయకులు పాల్గొన్నారు.
జడ్చర్ల టౌన్: పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో నియోజకవర్గ అధ్యక్షుడు డా.జాకీర్ అలీ, నాయకులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ఫ్యామిలీ ఫెస్టివల్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా ఫ్యామిలీ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయశ్రీ మాట్లాడుతూ తల్లిదండ్రులను పిల్లల గౌరవించడం సాంప్రదాయమని, వాటిని కాపాడాలంటే ఇటువంటి కార్యక్రమాలు అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మనోహర్, చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.